భళా బోపన్న

ఆస్ట్రేలియా ఓపెన్ డబుల్స్ టైటిల్ కైవసం • ఫైనల్లో ఇటలీ జోడీపై జయభేరి

గ్రాండ్‌స్లామ్ నెగ్గిన అతి పెద్ద వయస్కుడిగా రికార్డు నమోదు

మహిళల చాంప్ సబలెంక

రోహన్ బోపన్న అద్భుతం చేశాడు! అద్వితీయ ఆటతీరుతో విజృంభించిన ఈ సీనియర్ ప్లేయర్.. ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేజిక్కించుకున్నాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఇటలీ జంటపై బోపన్న-ఎబ్డెన్ జోడీ ఘనవిజయం సాధించింది. ఇప్పటి వరకు ఒక మిక్స్‌డ్ డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన బోపన్న.. 43 ఏండ్ల వయసులో డబుల్స్ టైటిల్ గెలిచి ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక టైటిల్ గెలుచుకుంది.

1 అతి పెద్ద వయసు (43)లో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన ప్లేయర్‌గా రోహన్ బోపన్న రికార్డుల్లోకెక్కాడు.

2 బోపన్నకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2017లో గాబ్రెలాతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలిచాడు.

> కొన్నేండ్ల క్రితం వరుసగా.. ఐదు నెలల పాటు ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేదు. ఆ సమయంలో ఇక రిటైర్మెంట్ ప్రకటించడమే మేలు అనుకున్నా. కానీ.. ఏదో సాధించాలనే తపన నన్ను ఇక్కడి వరకు వచ్చింది. మాథ్యూతో చక్కటి అనుబంధం ఉంది. అదే మ్యాచ్‌లో ప్రస్ఫుటమైంది. మీరు కూడా పోరాటాన్ని వదలొద్దు. ప్రయత్నిస్తేనే ఫలితాలు వస్తాయి.
> –రోహన్ బోపన్న

మెల్‌బోర్న్: వయసు ఒక సంఖ్య మాత్రమే అని చాటుతూ.. భారత సీనియర్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్న సంచలనం నమోదు చేశాడు. లేటు వయసులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన పురుష టెన్నిస్ ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ జంట 7-6 (7/0), 7-5తో సిమోన్ బొలెల్లి-అండ్రె వావ్‌సోరీ (ఇటలీ) ద్వయంపై గెలిచింది. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన బోపన్న జోడీ.. 8 ఏస్‌లు కొట్టి 26 విన్నర్లు కొట్టింది. మరోవైపు ప్రత్యర్థి జంట ఒక ఏస్ మాత్రమే సంధించి 15 విన్నర్లకు పరిమితమైంది. గంట 39 నిమిషాల పాటు సాగిన పోరులో రోహన్ ద్వయం 4 డబుల్ ఫాల్ట్స్ చేస్తే.. ఇటలీ ప్లేయర్లు 6 రిటర్న్ అనవసర తప్పిదాలు చేశారు. ఇప్పటి వరకు భారత్ నుంచి లియాండర్‌పేస్-మహేశ్ భూపతి జంట మాత్రమే మేజర్ టైటిల్స్ నెగ్గగా.. మహిళల విభాగంలో సానియా మీర్జా ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ ఖాతాలో

వేసుకుంది. 2017 ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ నెగ్గిన బోపన్నకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా.. పురుషుల డబుల్స్‌లో మూడోసారి ఫైనల్ చేరి విజేతగా నిలిచాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బోపన్నకు పద్మశ్రీ అవార్డు ప్రకటించగా.. తాజా ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కూడా అందుకున్నాడు. బోపన్న జంటకు దాదపు 4 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

క్వీన్ సబలెంక

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అరియానా సబలెంక రెండో టైటిల్ ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సబలెంక (బెలారస్) 6-3, 6-2తో జెంగ్ (చైనా)పై విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో రెండో సీడ్ సబలెంక పూర్తి ఆధిపత్యం కనబర్చింది. గంట 16 నిమిషాల పాటు సాగిన తుదిపోరులో జెంగ్ 6 ఏస్‌లు కొట్టగా.. మూడు ఏస్‌లకే పరిమితమైన సబలెంక 14 విన్నర్లు సంధించింది. మ్యాచ్ అనంతరం సబలెంక మాట్లాడుతూ.. 'నమ్మశక్యంగా లేదు. ఈ టోర్నీ అద్భుతంగా సాగింది' అని పేర్కొంది.

వ్రితి డబుల్ ధమాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చెన్నై వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం జరిగిన మహిళల 200మీ ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి (2 ని.11.22 సె.) స్వర్ణంతో మెరువగా, అదితి (మహారాష్ట్ర), శ్రీచరణి (కర్ణాటక) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు అదే జోరు కొనసాగిస్తూ 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి (9.22.74) మరో పసిడి ఖాతాలో వేసుకుంది.

క్వార్టర్స్‌లో శ్రీజ

పనాజీ: తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ.. వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గోవా వేదికగా జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ ప్రి క్వార్టర్స్‌లో శనివారం ప్రపంచ 66వ ర్యాంకర్ శ్రీజ 3-1 (12-10, 8-11, 11-8, 11-8)తో 36వ ర్యాంకర్ డో హోయి కిమ్ (హాంకాంగ్)పై విజయం సాధించింది. మరోవైపు స్టార్ ప్యాడ్లర్లు మనికా బాత్రా, అర్చనా కామత్ పరాజయం పాలయ్యారు.

పోప్ పోరాటం

అజేయ శతకం

పోప్ (148*)

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 316/6 • ఆధిక్యం 126 పరుగులు

ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో భారత విజయానికి ఓలీ పోప్ అడ్డుగోడలా నిలిచాడు. సహచరులంతా తడబడ్డ ఉప్పల్ పిచ్‌పై.. అసమాన రీతిలో పోరాడిన పోప్ అజేయ శతకంతో ఇంగ్లిష్ జట్టును మంచి స్థితికి చేర్చాడు. మూడో రోజంతా ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన చేయగా.. భారత బౌలర్లు వికెట్లు తీసేందుకు విశ్వప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. ఆదివారం ఇంగ్లండ్‌ను ఎన్ని పరుగుల లోపు ఆలౌట్ చేస్తారనేది కీలకంగా మారింది!

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బంతి గింగిరాలు తిరుగుతున్న చోట ఎలా బ్యాటింగ్ చేయాలో.. అనూహ్య బౌన్స్‌ను తట్టుకొని స్థిరంగా ఎలా నిలబడాలో.. ఇంగ్లండ్ వన్‌డౌన్ బ్యాటర్ ఓలీ పోప్ (208 బంతుల్లో 148 బ్యాటింగ్, 17 ఫోర్లు) అజేయ శతకంతో అక్షరాల చేసి చూపాడు. సహచరులు చేతులెత్తేసిన చోట ఒంటరి పోరాటం చేసిన పోప్.. ఇంగ్లండ్‌ను కష్టాల నుంచి గట్టెక్కించాడు. మూడో రోజే ముగిసేలా కనిపించిన మ్యాచ్‌ను పోప్ రసవత్తరంగా మార్చాడు. ఓవర్‌కు 4.10 రన్‌రేట్‌తో పరుగులు చేసిన ఇంగ్లండ్ శనివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఓపెనర్లు బెన్ డకెట్ (47), జాక్ క్రాలీ (31), బెన్ ఫోక్స్ (34) పర్వాలేదనిపించారు. దీంతో ఓవరాల్‌గా ఇంగ్లండ్ 126 పరుగుల ఆధిక్యం సాధించింది. పోప్‌తో పాటు రెహాన్ అహ్మద్ (16) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో బుమ్రా, అశ్విన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 421/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్‌ఇండియా మరో 15 పరుగులు మాత్రమే జోడించి 436 పరుగులకు ఆలౌటైంది. జడేజా (87), అక్షర్ (44) ఎక్కువసేపు నిలువలేకపోయారు దీంతో భారత్‌కు 190 పరుగుల ఆధిక్యం లభించింది.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246; భారత్ తొలి ఇన్నింగ్స్: 436 (జడేజా 87, రాహుల్ 86; రూట్ 4/79); ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 316 /6 (పోప్ 148, డకెట్ 47; బుమ్రా 2/29, అశ్విన్ 2/93).

ఉప్పల్ జనసంద్రం

భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం ప్రేక్షకులతో జనసంద్రమైంది. సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు ఆదరణ తగ్గుతున్న వేళ.. హైదరాబాద్‌లో ఫ్యాన్స్ స్టేడియానికి పోటెత్తుతున్నారు. గత మూడు రోజుల నుంచి భారీ సంఖ్యలో ఫ్యాన్స్ హాజరవుతున్నారు. హైదరాబాద్ ఇప్పటి వరకు ఆతిథ్యమిచ్చిన తొమ్మిది టెస్టుల్లో ఎన్నడూ 20 వేల మంది అభిమానులు రాలేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో దేశంలో ఎక్కడా లేని విధంగా టెస్టుకు స్కూల్ విద్యార్థులు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన జవాన్లు, వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. దీనిపై హెచ్‌సీఏ విస్తృత ప్రచారం కల్పించడం బాగా కలిసొచ్చింది.

హైదరాబాద్ జైత్రయాత్ర

రంజీ ట్రోఫీలో వరుసగా నాలుగో విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగుతున్నది. ప్లేట్ గ్రూప్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ నమోదు చేసుకున్న హైదరాబాద్.. తాజాగా ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ ట్రిపుల్ సెంచరీ బాదడంతో అరుణాచల్ ప్రదేశ్‌పై ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనూ రెండు రోజుల్లోనే ఫలితం రావడం కొసమెరుపు. ఓవర్‌నైట్ స్కోరు 529/1తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్.. 615/4 వద్ద డిక్లేర్ చేసింది. తన్మయ్ (181 బంతుల్లో 366; 34 ఫోర్లు, 26 సిక్సర్లు) రికార్డు త్రిశతకం ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అరుణాచల్ ప్రదేశ్ 256 పరుగులకు ఆలౌటైంది. దివ్యాన్ష్ (91) టాప్ స్కోరర్ కాగా.. మన బౌలర్లలో తనయ్, సాయిరామ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. తాజా సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ బోనస్ పాయింట్ విజయాలు సాధించింది.

ఫైనల్లో భారత్

మహిళల హాకీ ఫైవ్స్ వరల్డ్‌కప్

మస్కట్: మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 6-3 తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. భారత్ తరపున అక్షత (7వ నిమిషంలో), మరీనా (11వ), ముంతాజ్ (21వ), రుతుజ (23వ ని.లో), జ్యోతి (25వ), అజిమా (26వ) ఒక్కో గోల్ చేశారు. ఫైనల్లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.